# జయ జయ జయహే!

కె.వి.రామిరెడ్డి కథ

సడన్‌గా బస్సుకు బ్రేక్ వేసినట్టున్నాడు డ్రైవరు. చిన్న జర్క్. మెలకువ వచ్చింది. తెలతెలవారుతూంది. ప్రాతఃకాలపు తాజాదనం. ఒక్కసారిగా కళ్ళు నులుపుకుని రోడ్డుమీదకు చూశాను.

రోడ్డుకు అడ్డం పడి నడుస్తున్న ఆవుల మందను పక్కకు మళ్ళిస్తున్నాడు పాలేరెవరో.ఆవులు తాపీగా రోడ్డు దిగి బస్సు పక్కగా వెళ్ళసాగాయి. ఇంతలోనే పక్కనున్న పుంతలోంచి పందలాదిగా గొర్రెలు రోడ్డెక్కేసాయి. డ్రైవరు అసహనంగా హారన్ మోగించసాగాడు. గొర్రెలు మటుకు వినబడనట్టుగానే తాపీగా రోడ్డుకు అడ్డంగా నడుచుకుంటూ వెళ్లసాగాయి.

పక్క పంటచేల వెంబడి రకరకాల చెట్లు, చేమలు...చిన్న చిన్న పూలు రంగురంగుల్లో...అదో వింత పరిమళం. కిటికీలోంచి అలా బయటకు చూస్తూండిపోయాను.

పక్కన మధు ఇంకా నిద్రపోతున్నాడు.

బస్సు కదిలింది. బస్సుతో పాటే ఏవేవో ఆలోచనలు బుర్రలో మెదలసాగాయి. అయితే ఆహ్లాదకరమైన ఆలోచనలే!

మరో అరగంట బస్సులో ప్రయాణించాము. ఎవరో నిద్రలేపినట్టుగా లేచి కూర్చున్న మధు " ఏరా ప్రశాంత్...ఎప్పుడు లేచావు? అదిగో దూరంగా కనిపిస్తున్న ఆ తోటల మధ్యనే మన స్కూలు" అన్నాడు.

బస్సు ఆగింది. ఊరొచ్చినట్టేవుంది అనుకున్నాను.

మనసులో మాట కనిపెట్టేసినట్టు " ఇక్కడే మనం దిగాల్సింది. ఇది మండల్ హెడ్‌క్వార్టర్" అంటూ సూట్‌కేసుని తీసుకున్నాడు మధు.

నేనూ బ్యాగు తీసుకున్నాను. భుజాన వేసుకుని మధు వెనగ్గా బస్సు దిగాను.

ఎదురుగ్గా మండలరెవిన్యూ అధికారి కార్యాలయం కనిపించింది. అక్కడున్న నలుగురయిదుగురు పెద్దవాళ్ళు మమ్మల్ని చూడగానే గబగబా దగ్గరకు వచ్చారు.

"ఏం, మధు బాబు ఐ.పి.ఎస్., ఆఫీసరు అయిపోయావట....చాలా హాపీగా వుంది" అంటూ ఒక యాభై ఏళ్ళతను మధును పలకరించాడు.

" ఈయన కృష్ణయ్య. ఇక్కడ ఎమ్మార్వో." అంటూ నాకు పరిచయం చేశాడు మధు.

ఆయన వైపు తిరిగి "కృష్ణయ్యగారూ! వీడు నా ఫ్రెండ్...సివిల్‌సర్వీసెస్‌లో ఆలిండియా లెవెల్లో ఐదో ర్యాంకు తెచ్చుకున్నాడు. కలెక్టరన్న మాట" అంటూ నన్ను ఆయనకు పరిచయం చేశాడు.

ఆయన చాలా కుతూహలంగా నన్ను చూశాడు. "వామ్మో! ఇద్దరు పెద్దాఫీసర్లు ఒకేసారి ఊర్లోకి వచ్చేశారన్న మాట" నవ్వుతూ నాతో కరచాలనం చేశాడు. పక్కనున్న మనిషితో మాచేతిలోని లగేజీని తీసుకోమని పురమాయించాడు.


మధు సున్నితంగా తిరస్కరించాడు. అక్కడున్న మరో ఇద్దరు మౌనంగా వుండటం చూసి మధూనే "ప్రశాంత్...పిన్ని స్కూల్లో టీచర్లు" అంటూ పరిచయం చేశాడు.

ఇద్దరూ కుర్రాళ్లే. ఇరవై అయిదు, ఇరవై ఆరేళ్ల లోపు వారే. "నమస్కారమండి. మిమ్మల్ని కలవడం మాకు చాలా గర్వంగా వుంది" అంటూ నమస్కరించారు. "నా పేరు మురళి. ఇతను రాంబాబు" అంటూ అందులో ఒక కుర్రాడు పరిచయం చేసుకున్నాడు.

"కృష్ణయ్య గారూ మళ్ళీ కలుద్దాం" అంటూ మధు రోడ్డుదిగి మట్టిరోడ్డుమీదుగా నడవసాగాడు. నేను, ఆ ఇద్దరు టీచర్లూ మధు వెనగ్గా నడవసాగాము.

మేము నడుస్తున్నది మట్టిరోడ్డయినప్పటికీ గట్టిగా, చదునుగా వుంది. రోడ్డుకు రెండువైపులా పేరు తెలీని చెట్లు, తీగలు పొదలు పొదలుగా అల్లుకుని వున్నాయి. అయితే ఏవీ రోడ్డుకు అడ్డంగా మటుకు లేవు.మనసులో పైకి చెప్పలేని ఆనందం ఏదో ముప్పిరిగొంటున్నది. అందమైన అనుభూతులేవేవో సాంబ్రాణి పొగలా లోలోపల....మధు నాతో అంటుంటాడు "నీది మరీ సున్నితమైన మనసు ప్రశాంత్. ప్రతి చిన్న విషయానికి పసిపిల్లాడిలా స్పందించిపోతావు..ఐ లైక్ ఇట్...ఐ లైక్ ఇట్ వెరీ మచ్"అనీ. అవును నాది పసి మనసే. జీవితంలోని చేదు అనుభవాలు, దుర్భర పరిస్థితులు ఏవీ నన్ను మార్చలేకపోయాయని అన్నయ్య కూడా అంటుంటాడు. బహుశా ఆ గుణం వల్లే నేను జీవితంలో చాలా పొందగలిగానని పిస్తుంది..ఐ.ఏ.ఎస్.తో సహా.

కాస్త దూరం నడవగానే మధు కాస్త ఆగి మాతో పాటు నడవటం మొదలు పెట్టాడు.



"ప్రశాంత్, ఈ రోడ్డంతా స్కూలు పిల్లల శ్రమదాన ఫలితమే. ఇక్కడికి సరిగ్గా మైలు దూరంలో వుంటుంది ఆస్కూలు" అన్నాడు మధు.

ఆసక్తి కలిగించింది. మధు ఎప్పటినుంచో ఇక్కడి వద్దామనేవాడు. ఇద్దరికీ ఏదో పనిబడి వీలు చిక్కేది కాదు. అంతేకాదు పరీక్షల ప్రిపరేషన్ కూడా కొంత కారణమే! సివిల్ సర్వీసెస్‌ను ఒక సవాలుగా తీసుకుని నేను ఆ పరీక్షలకు ప్రిపేరయ్యాను. తరాలతరబడి ఏడిపించిన మా సామాజిక, ఆర్థిక దుస్థితి నుంచి బయట పడటానికి ఇందులో విజయమే కారణమవుతుందని మనసుకు పదేపదే చెప్పుకుంటూ వుండేవాణ్ని.

సివిల్స్‌పరీక్షల ప్రిపరేషన్ సందర్భంలోనే మధు నాకు మిత్రుడయ్యాడు. మెల్లగా మంచి మిత్రుడయ్యాడు. క్రమంగా నాకు అన్నీ తానై నడిపించే ఆత్మీయుడయ్యాడు. మధు సివిల్స్ పట్ల పెద్ద సీరియస్‌గా వుండేవాడు కాదు. తను ఇంజినీరు. చక్కగా ఇంజినీరుగానే పనిచేసుకుపోవాలని అనుకునేవాడు. ఇంజినీర్లు చాలా మందివున్నారు. "అడ్మినిస్ట్రేటివ్ రంగంలో ఒక ఉన్నత స్థానంలో వుంటేనే బావుంటుందిరా, నలుగురికి ఉపయోగపడుతావు" అంటూ మధు పిన్ని చెప్పిందిట. మధుకు ఆమె మాట వేదవాక్కు. ఆ పిన్ని నడుపుతున్న స్కూలుకే మేము వెళుతోంది.

"ఓ...మధూ, బావున్నావా? ఎప్పుడొచ్చావు" రోడ్డుకు కొంచెం దూరంలోని తోటలో కలుపు తీస్తున్న ముసలావిడ గట్టిగా కేక పెట్టింది.

"బావున్నాను పెద్దమ్మా. నువ్వు బావున్నావా?" మధు కూడా గట్టిగా అరిచినట్టుగా జవాబిచ్చాడు.

"సాయంత్రం స్కూలుకాడికొస్తా. వుంటావు కదా" అందావిడ.

"రా, పెద్దమ్మా...నీకోసం చూస్తుంటా" అంటూ మధు ముందుకు కదిలాడు.

"ప్రశాంత్, ఆవిడ పేరు నర్సమ్మ. ఈ పల్లెలో మామూలు పిల్లల దగ్గరనుంచి, మీసాలు తిప్పే ముఠానాయకుల వరకు జడిసేది ఆవిడ నోటికే. వున్నదున్నట్టు మాట్లాడుతుంది. కష్టం కలిగిన మనిషెవరైనా సరే సాయం అడగడమే తరువాయి అన్నీ మరిచిపోయి వారి మంచికోసం ఏమైనా చేస్తుంది. అట్లాగే తేడా వస్తే ఎవడితోనైనా 'నువ్వెంతంటే నువ్వెంత' అంటూ పంతానికి పోతుంది. అన్నట్టు గాంధీగారు ఒకసారి ఇటు వచ్చాడట. ఈ నర్సమ్మ అప్పుడు ఆఇంట కొత్త కోడలు. అత్తగారు నసుగుతున్నా, మొగుడుగారు గుడ్లు మిటకరించినా లెక్క చెయ్యకుండా గాంధీగారిని చూడటానికి రోడ్డు మీదకు వచ్చేసిందట. వచ్చింది వచ్చినట్టు ఉండకుండా 'గాంధీగారు జోలెపడితే చూడలేకపోయానంటూ' కొత్తపెళ్ళికూతురిగా ఒంటిమీదున్న కేజీన్నర బంగారం ఆయన జోలెలో కుమ్మరించిదట" అంటూ మధు నాకేసి చూశాడు.

ఆశ్చర్యమేసింది నాకు. దాంతో పాటే ఆమె కథ వినాలన్న కూతూహాలం రేగింది. వెనక్కి తిరిగి దూరంగా పొలాల్లో పనిచేసుకుంటున్న ఆమె కేసి చూశాను.

యాభైఏళ్ల స్వతంత్రభారతం చుక్కానిలా అనిపించి దావిడ "ఇంకా ఆ పెద్దమ్మ ఏమేమి చేసింది మధూ" అన్నాను.

మా వెంట వస్తున్న ఇద్దరు టీచరు కుర్రాళ్ళు మమ్మల్ని ఆసక్తి గమనిస్తూ, శ్రద్ధగా వింటూ మౌనంగా నడుస్తున్నారు.

" ఆ పెద్దమ్మ కథలో 'స్వతంత్రం వచ్చిన యాభైఏళ్లలో స్త్రీ' అన్న సబ్జెక్టుకు సరిపడా విషయం వుంది. మొగుడు తాగుడు, ముఠాగొడవల్లో పడి చిన్నవయసులోనే పోయాడు. పోతూ పోతూ తనకు వాటాగా వచ్చిన ఆస్తిని పూర్తిగా కరిగించి మరీ పోయాడు. ఈవెం పాలు అమ్మి, కోళ్లఫారం నడిపి, తిరిగి భూములు కొనుక్కుని ఇప్పుడు వూర్లో మళ్లీ పెద్ద ఇంటి మనిషిగా నిలిచింది. ఇప్పుడామెకు డెబ్బయిఏళ్ల దరిదాపు వయసు. అయినా సరే నడుం వంచి పనిచేయటం, నిటారుగా నడవటం ఆమెను చూసే నేర్చుకోవాలంటారు వూరిజనం. అంతేగాదు ఆపెద్దమ్మ ముగ్గురు కూతుళ్లు. ముగ్గురినీ చదివించింది. ఒకామె లాయరు. రెండో ఆమె డాక్టరు. మూడో ఆమె బ్యాంకు ఆఫీసరు. కూతుళ్ల కోసం కట్నం దాచిపెట్టడం, ఇంత చదివితే పెళ్లవుతుందా? అనుకోవడం వంటి ఆలోచనలకు నలభై ఏళ్ల క్రితమే మానేసిన ప్రగతిశీలి. మరో ఇంటరెస్ట్ విషయం ఏంటో తెలుసా, పెద్దమ్మ ముగ్గురు

**అత్తగారు నసుగుతున్నా, మొగుడుగారు గుడ్లు మిటకరించినా లెక్క చెయ్యకుండా గాంధీగారిని చూడటానికి రోడ్డు మీదకు వచ్చేసిందట. వచ్చింది వచ్చినట్టు ఉండకుండా 'గాంధీగారు జోలెపడితే చూడలేకపోయానంటూ' కొత్తపెళ్ళికూతురిగా ఒంటిమీదున్న కేజీన్నర బంగారం ఆయన జోలెలో కుమ్మరించిదట"**

అల్లుళ్ళు వ్యవసాయమే చేస్తారు. ఈమెతో పాటే వుంటారు. దటీజ్ నర్సమ్మ" అంటూ చెప్పాడు మధు.

కథల్లోనో, సినిమాల్లోనో అబ్బురపరచే విషయాలు మనపక్కనే కనిపించి పలకరిస్తుంటాయి కదా అనిపించింది. సరిగ్గా ఇలాంటి జీవితాలే, ఇలాంటివారి కథలే నన్నూ మనిషిగా తీర్చిదిద్దాయి అన్న గట్టినమ్మకం నాది. ఈ విషయం మధూకు బాగా తెలుసు. ఒకరకంగా మా ఇద్దరిదీ ఒకటే మనస్తత్వం. జీవితంలోని చెడుకు, కష్టాలకు, అపజయాలకు మన రియాక్షన్ ఎప్పుడూ పాజిటివ్‌గానే వుండాలన్నది మా ఇద్దరి సిద్ధాంతం. వాటి రిఫ్లెక్షన్స్‌గా నిరాశ, ద్వేషం, కుంగిపోవడం వంటివి కూడదు. నిరాశ స్థానే ఆశ, ద్వేషం స్థానే ప్రేమ, కుంగిపోవడం స్థానే ఆత్మవిశ్వాసం మనలో కలగాలి. అప్పుడే మనం జీవితాన్ని ప్రేమిస్తాం. జీవితం మనల్ని ప్రేమిస్తుంది. ఇలాంటి విషయాలన్నీ మేము తరచూ చర్చించుకుంటుంటాం.

మధూకు, నాకు సైకాలజీ, సోషియాలజీ సబ్జెక్టులంటే చాలా ఇష్టం. "మీ ఇద్దరికీ బ్యాలెన్స్ ఆఫ్ మైండ్ వుంది. విషయాల్ని చక్కగా అవగాహన చేసుకుని విశ్లేషించే సామర్థ్యం వుంది. ఈ లక్షణం సివిల్స్‌లో మీకు బాగా వుపయోగపడుతుంది" అనేవారు మాకు కోచింగ్ ఇచ్చిన జనరల్‌స్టడీస్ లెక్చరర్.

మేము స్కూలు దగ్గరకు వచ్చేలోపల దాదాపు పది ఇరవై మంది దాకా మధును పలకరించారు. వాళ్లు పలకరించగానే మధు వారి గురించి నాకు చెప్పేవాడు. అందరి కథల్లోనూ, మాటల్లోనూ, ఈ దేశం కనిపించింది నాకు. రాజధాని నగరాల్లో జరిగే నిర్ణయాలు మారుమూలపల్లెల్లో సైతం మంచికో, చెడుకో ఎలాంటి ప్రభావాల్ని చూపిస్తాయో తెలిసింది.

స్కూలు ప్రహారీలాగా చుట్టూ చెట్లు. మేము ఇంకా స్కూలు ఆవరణలోకి అడుగుపెట్టకనే బిలబిలా పిల్లలు బయటకు వచ్చారు. గుంపులు, గుంపులుగా బయటకు రావటం మధుకు సెల్యూట్లు చేయటం.

'కాస్త ప్రొటోకాల్ తప్పినట్టు వుంది కలెక్టరు గారూ! ఏమనుకోకండి..." అంటూ నా చేతిని సున్నితంగా నొక్కాడు మధు.

నేను చిన్నగా నవ్వాను. ఈ లోగా ఆమె వచ్చింది. చూడగానే ఆమె మధు పిన్ని అనిపించింది. ఎంతో హుందాగా, చూడగానే నమస్కరించేలా వుందామె.

"మా పిన్ని, స్వరాజ్యలక్ష్మి" అంటూ నాకు పరిచయం చేశాడు మధు.

చిరునవ్వుతో నాకేసి చూస్తోన్న ఆవిడకు చేతులు జోడించి నమస్కరించాను.

"ప్రయాణం బాగా జరిగిందిరా మధూ! ఆ కట్టకింద పల్లెనుంచి ఆనందవరం వరకు రోడ్డు వేస్తున్నారు. పక్కనుంచి బస్సులు రావాలి. రోడ్లంతా గతుకులు గదా!" అందామె.

"నాకేం తెలుసు హాయిగా నిద్రపోయా. మా ప్రశాంతు మెలకువతోనే వున్నట్టున్నాడు. ఏరా ప్రయాణం సాఫీగా సాగినట్టేనా?" అంటూ నన్నే ప్రశ్నించాడు మధు.

"మీ స్కూలు చూడాలన్న ఆనందంలో మాకేమీ తెలియలేదండీ" అన్నాను.

ఆమెను చూస్తుంటే అమ్మను చూసినట్టే వుంది. ఆమె పలకరింపు అమ్మలానే వుంది.

ఈ లోగానే ఒక పెద్దావిడ గబగబా వచ్చి, మధును చూసి నవ్వి" అమ్మా! ఈ రోజు పాలన్నీ స్కూలుకే వాడుకోవాలనుకున్నాం కదా?" అని ప్రశ్నించింది.

"అవునే, ఈరోజు, రేపు పాలన్నీ మనమే వాడుకుందాం. ఆ వృద్ధాశ్రమానికి మటుకు పంపు. చెప్పాను కదా అని వాళ్లకు కూడా లేకుండా చెయ్యకు. సొసైటీ వాళ్లకు చెప్పానులే. రెండు రోజులు పాలు బంద్ అనీ" అంటూ ఆమె అక్కడ వున్న పిల్లలకు ఏవేవో పనులు పురమాయించింది. ఆమె మాటలు వినడమే ఆలస్యం చాలా హుషారుగా, చలాకీగా పిల్లలు పరుగుపరుగునా వెళుతున్నారు.

ఆమె నవ్వుతూనే చెబుతోంది. ఆమె మాటను 'ఆర్డర్' తీసుకుని పనిచేస్తున్నారందరూ అనిపించింది.

'రా, రా మధూ. అవును బాబు నీపేరు ప్రశాంత్ కదూ! మా మధు నీగురించి అన్ని విషయాలు చెప్పాడయ్యా. వాడు రాసే ఉత్తరాల్లో నీ గురించిన ప్రసక్తి లేకుండా వుండదు. సివిల్స్‌లో నీ సక్సెస్‌కు హార్టీ కంగ్రాచ్యులేషన్స్" అంటూ ఆమె అక్కడికి కొంచెం

దూరంలోని ఇంటికేసి నడిచింది. నేను, మధు ఆమెను అనుసరించాం.

ఇంటిముందు పూల మొక్కలు తీర్చిదిద్దిన ముగ్గుల్లా వున్నాయి. రంగు రంగుల పూలతో పొద్దుటిపూట చిరుగాలి తలలాడిస్తున్న ఆపూలను చూస్తుంటే, మనసునెవరో మంచిమనిషి తడుముతున్నట్టుగా వుంది.

ఇంట్లోకి వెళ్ళాం. వేణ్ణీళ్ళతో స్నానం చేస్తుంటే అమ్మ మునివేళ్ళ ఒళ్ళంతా తాకినట్టు అనిపించింది. ఆమె మాకు వేడివేడి ఇడ్లీలు, వేరుశనగ చట్నీ వేసి ఫలహారంగా వడ్డించింది. "మా పిల్లలే వంతులవారీగా వంట కార్యక్రమాలు చేపడుతుంటారు" అంటూ ఆమె కూడా మాతో పాటే టిఫెన్ తింది.

ఆమెనే గమనిస్తున్నాను నేను. ఎంతో కాలంగా పరిచయమున్న వ్యక్తిలా అనిపిస్తోంది. అదే సమయంలో కొత్తగానూ వుంది. ఆమె ప్రతి కదలికలోనూ, ప్రతి మాటలోనూ దశాబ్దాల తరబడి శ్రమించి కూడగట్టుకున్న వ్యక్తిత్వమేదో 'హుందా'గా కనిపిస్తోంది. అదే సమయంలో ఒక రకమైన డిసిప్లిన్, టైం సెన్స్‌లు కూడా నన్ను ఆకట్టుకున్నాయి. 1970 ప్రాంతాల్లో ఖరగ్‌పూర్ ఐ.ఐ.టిలో ఫిజిక్స్ చదివినావిడ ఇక్కడ, ఈపల్లెటూళ్ళో, స్కూలు నడుపుకుంటూ గడిపేస్తోంది.

ఆమెతో మాట్లాడుతున్నంతసేపు మామూలు సాదాసీదా మనిషితోనే వ్యవహరిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఆమె అలా వెళ్ళగానే ఎంత గొప్ప వ్యక్తి అన్న భావన కలుగుతోంది. ఆమెలో ఏదో విలక్షణత దాగుంది... బహుశా అది ఆమె జీవితమే కావచ్చు.

మధు ఆమె గురించి చాలా సార్లు చెప్పాడు. మధు అమ్మగారి తరువాత ఇద్దరు మగపిల్లలట. తరువాత ఈమె స్వరాజ్యలక్ష్మి. సరిగ్గా 1947,ఆగస్టు పదిహేనున ఆమె పుట్టడంతో నాన్న గారు స్వరాజ్యలక్ష్మి అని పేరుపెట్టారట. చదువులో ఎప్పుడూ వెనకబడని ఆమెను పెద్ద చదువులే చదివించారు. పరాయిరాష్ట్రానికి పంపి మరీ చదివించారు.ఐ.ఐ.టిలో చదువు పూర్తి కాగానే అక్కడే ఆమె సహ విద్యార్థిగా వున్న అతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. అంతా సాఫీగా వుందనుకుంటున్న రోజుల్లోనే అతను చెప్పాపెట్టకుండా దేశం వదిలిపెట్టిపోయాడు. అప్పటికే అమెరికాలోని సెటిల్ అయిన అమ్మాయిని పెళ్లి చేసుకుని, ఆచట్టబద్ధతతో సులువుగా అమెరికాకు వెళ్ళాడతను. అక్కడకు వెళ్ళిన తర్వాత ఈమెకు ఎలాంటి నష్టంజరగనివ్వనని, తనను కూడా అమెరికాకు తీసుకెళతానని ఉత్తరాలమీద ఉత్తరాలు గుమ్మరించాడు. అయినా ఈమె వినలేదట.

"నా పేరు స్వరాజ్యలక్ష్మి కదా! అందుకే పూర్తి స్వేచ్ఛను అనుభవించు అని రాసిపెట్టినట్టున్నాడు మీ దేవుడు. అట్లాగే వుంటానంటూ...తన పల్లెకు చేరుకుంది. చిన్నగా స్కూలు మొదలెట్టింది. స్కూలు పిల్లలే తన పిల్లలుగా, అక్కడ మనుషులే తన ఆత్మీయులుగా ఆమె మరో ఆలోచన లేకుండా యాభైఏళ్ల జీవితాన్ని గడిపేసింది. ఇదంతా మధు చాలా అభిమానంగా తరచూ నాతో చెప్పే కథ.

ఆమె నడుపుతున్న స్కూలు మారుమూల పల్లెలో వున్నా దేశంలోనే ఆదర్శమైన బడిగా పేరు తెచ్చుకుంది. సుమారు ఐదువందల మంది విద్యార్థులు అక్కడ జీవితాన్ని, చదువును ఒంటబట్టించుకుంటుంటారు.

మధు కూడా అక్కడే చదువుకున్నాడు. కులమతాలు, హెచ్చుతగ్గులు లేని వాతావరణం అక్కడ వేళ్లూనుకుంది.

టిఫిన్ చేసిన తర్వాత నేను, మధు మాతో పాటు వచ్చిన ఇద్దరు టీచర్లు స్కూలు ఆవరణంతా కలయతిరిగినప్పుడు నాకు ఆమె మీద మరింత గౌరవం పెరిగింది. చిన్నగా మొదలైన ఆస్కూలు వంద ఎకరాలుగా విస్తరించింది. అక్కడ అడుగునేల కూడా వృధాగా లేదు. స్కూలుకు పోను మిగిలిన భూమినంతా తోటలుగా, పంటపొలాలుగా మార్చేశారు. వ్యవసాయం చేసేదంతా పిల్లలే.చేతి పనులు, ఇతర మానవ అవసరాలకు సంబంధించిన విషయాల పట్ల అవగాహన కూడా కలిగిస్తున్నారు. వున్న కొంతమంది పనివాళ్లు వాళ్లకు పనిగురించి, అందులో మెలకువలు గురించే వివరించే మాస్టార్లే కాని మరొకటి కాదు. ఎక్కడో దక్షిణాఫ్రికాలో గాంధీ నడిపిన టాల్

**అక్కడ తిరుగుతుంటే అమ్మ, నాన్న గుర్తొచ్చారు. అన్నయ్య గుర్తొచ్చాడు. నాకోసం వాళ్ళు పడ్డ శ్రమంతా గుర్తొచ్చింది. మా పసితనాన ఇలాంటి వాతావరణం మాకు వుంటే ఎంత బాగా వుండేది కదా అనిపించింది. అవును నేను పెరిగింది వూరుకు దూరంగా వున్న వాడలో.**

స్టాయ్‌ఫాం గురించి చదవడమే గాని చూడలేం కదా?! అదిక్కడ కనిపిస్తోంది. అనిపించింది.

స్కూలు చుట్టూ తిరుగుతూ మధ్య మధ్యలో పిల్లలను పలకరిస్తూ, పగలంతా హాయిగా గడిపేశాం.

అక్కడ తిరుగుతుంటే అమ్మ, నాన్న గుర్తొచ్చారు. అన్నయ్య గుర్తొచ్చాడు. నాకోసం వాళ్ళు పడ్డ శ్రమంతా గుర్తొచ్చింది. మా పసితనాన ఇలాంటి వాతావరణం మాకు వుంటే ఎంత బాగా వుండేది కదా అనిపించింది. అవును నేను పెరిగింది వూరుకు దూరంగా వున్న వాడలో. నాకున్న బలమల్లా అనయ్య. ఎప్పుడో ఒకసారి మంచిరోజు వచ్చి తీరుతుంది అనే అమ్మ ఆశాజ్యోతుల్లాంటి మాటలు. తన పని తప్ప మరో ప్రపంచం గొడవలేని చీమ లాంటి నాన్న. అయినా సరే మేము పుట్టుకలోని వెనుకబాటుతనానికి, లేమిలోని కాఠిన్యానికి ఎంతలా బలయ్యామో... మాకు మాత్రమే తెలుసు. ఇప్పుడు ఏడ్చినా రానంతగా ఇంకిపోయిన కన్నీళ్ళకు తెలుసు. అందుకే నాకు ఈ వాతావరణంలో అడుగడుగునా ఏవో జీవనసందేశాలు వినిపిస్తున్నట్టుగానే వుంది. కలెక్టరుగా రేపటి నాజీవితానికి అర్థం తెలియచేస్తున్నట్టుగానే వుంది.

సాయంత్రమంతా పిల్లలు ఎక్కడలేని హడావుడి చేశారు. స్కూలు ఆవరణంతా నీళ్ల చల్లి ముగ్గులు పెట్టారు. స్తంభానికి పూలతో నింపిన జండాను చుట్టికట్టారు.ఇదంతా చాలా సంబరంగా పసిపిల్లాడి మల్లే చూస్తూండిపోయాను. 'ప్రతి పనిని ముందుగా చేయడం మాకు అలవాటన్నయ్యా, తెలతెలవారుతుండగానే మాస్కూలు జండా పైకెగరాలి' అంటూ ముద్దుముద్దుగా చెప్పిందో అమ్మాయి.

సాయంకాలం రంగులు మాయమయి నలువు చీకటి అలుముకుంది. ఆకాశంలో నక్షత్రాలు. డాబా పైన కూర్చుని ఆమె, నేను, మధు చాలా సేపు మాట్లాడుకుంటూ గడిపాం. ఎన్నెన్ని మాటలో...ఆమె చెబుతుంటే,'ప్రతి తల్లీ ఉగ్గుబాలతో బిడ్డకు నేర్పించాల్సిన మాటలివి' అనిపించింది. పిల్లలు రేపటికోసం చేస్తున్న రిహార్సల్స్ సందడి ఆగింది. అరుపులు నిశ్శబ్దమయ్యాయి. పది గంటలకు సరిగ్గా వారి గదుల్లోని లైట్లు ఆరిపోయాయి. దినమల్లా అల్లరల్లరి చేసిన పక్షులు గూటిలో చేరుకుని సవ్వడి మరిచి నిద్రకుపక్రమించినట్టనిపించింది.

ఎప్పుడు నిద్రపోయామో మాకే తెలీదు.తెల్లారి నాలుగ్గంటలకే ఆమె నన్నూ, మధును నిద్రలేపింది. దేశంలో స్వాతంత్రస్వర్ణోత్సవాలకు వెలుగురేకలు స్వాగతించడానికి సన్నద్ధమవుతున్నట్టున్నాయి. వెలుగు చీకట్ల మధ్య ఆకాశంలో రంగులు దోబూచులాడుతున్నాయి. నేను మధు ఫ్రెష్‌గా తయారయిపోయి స్కూలు గ్రౌండ్‌కు చేరుకున్నాం. అప్పటికే పిల్లలక్కడ క్లాసులవారీగా నిలబడిపోయారు. నేను, మధు ఒక పక్కగానిలబడ్డాం.అంత భారీగా లేకున్నా, అచ్చు టి.వి.లో కనిపించే రీతిలోనే రాజధానినగరాల్లోని పెరేడ్ గ్రౌండ్లలో కనిపించే విన్యాసాలన్నీ అక్కడా కనిపించాయి.

స్కూలు పీపుల్ లీడర్ సుశిక్షితుడైన సైనికుడిలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాడు.అదంతా చూస్తుంటే మనసంతా ఉద్విగ్నత నిండుకుంది. కొంతసేపటికి అతను మా దగ్గరికి వచ్చాడు. నాకు సెల్యూట్ చేశాడు. నాకు విషయం అర్థంకాక నవ్వాను. మధు నాకేసి చూస్తూ ముందుకు చేయి చూపాడు.మెల్లగా 'ప్రోటొకాల్' అన్నాడు. నాకు విషయం అర్థమయింది. గుండె ఎగిసెగసి పడింది. ఆ కుర్రాడిని అనుసరించాను. జండా దగ్గరకు చేరుకున్నాం. సెల్యూట్ చేశాను. ఆ కుర్రాడు ఫోల్‌కున్న తాడు మెలికలను తీసి నాకందించాడు. మనసులో 'ప్రతిజ్ఞ'! పవిత్రమైన బాధ్యత!! తాడును లాగాను. జలజలా పూలు...రంగురంగులపూలరెక్కలు రాలాయి. మొదట చిన్న అలల్లా, తర్వాత తరంగాలుగా ఎగిసపడే నీటి అలల పేలె ఆజండా నా జాతిజెండా రెపరెపలాడసాగింది. 'సెల్యూట్' చేశాను నేను, మేము, అక్కడందరూ!

చెట్ల మీది పక్షులు కిలాకిలారావాలుపోయాయి. పిల్లల గొంతులతో శృతి కలుపుతూ..."జనగణమన అధినాయక జయహే...భారత భాగ్యవిధాత..." జాతీయ గీతం మార్మోగుతోంది. కన్నీటి పొరమధ్యన నా చుట్టూ నేను ప్రేమించే ప్రపంచం! మనుషులు!!

గొంతుకడ్డుపడుతున్న భావోద్వేగాల ఉక్కిరిబిక్కిరిని చీల్చుకుంటూ నా గొంతునూ ఆ గొంతులతో శృతి చేశాను..."జయ జయ జయహే!!"